సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం ౹ 2 ౹ జనవరి ౹ 2024



సోమశిలలో 33.899 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం 33.899 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 17 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.65,280
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,863
3 శాతం జీఎస్టీతో	రూ.6,039
సవర (8గ్రా)	రూ.48,312

గరిష్టం/కనిష్టం
29.4 /23.1

వాతావరణం

సోమవారం గాలిలో తేమ 65 శాతం ఉంది. ఉష్ణోగ్రత తక్కువగానే ఉంటోంది. మంగళవారం మార్పులేవీ ఉండకపోవచ్చని వాతావరణ శాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

'అమృత్ భారత్'కు ఘన స్వాగతం



అమృత్ భారత్ రైలుకు స్వాగతం పలుకుతున్న కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు

నెల్లూరు(సెంట్రల్): రైల్వే శాఖ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'అమృత్ భారత్' ఎక్స్‌ప్రెస్‌కు నెల్లూరులో సోమవారం నాయకులు ఘన స్వాగతం పలికారు. పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా నుంచి బెంగళూరుకు నెల్లూరు మీదుగా వెళుతున్న ఈ రైలుకు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితర నాయకులు నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కొండ్రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనలతో 'అమృత్ భారత్' రైలు స్వాగత కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో కుటుంబం ఆత్మహత్యాయత్నం

- అన్నంలో పురుగుమందు కలిపి తిన్న భార్య, భర్త, ఇద్దరు పిల్లలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భాస్కర్‌రావు, చిన్నమ్మ, అవినాష్, దీపిక

కావలి: పట్టణంలోని తుఫాన్‌నగర్ ప్రాంతంలో నివాసం ఉండే ఎండ్లూరి భాస్కరరావు కుటుంబం సోమవారం అన్నంలో పురుగుమందు కలుపుకుని తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికుల వివరాల మేరకు.. కారు డ్రైవర్ అయిన భాస్కరరావు కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. అప్పులు కట్టలేకపోతే పరువు పోతుందనే ఆందోళనతో భాస్కర్‌రావు, అతని భార్య చిన్నమ్మ, వారి పిల్లలు పదకొండేళ్ల అవినాష్, ఎనిమిదేళ్ల దీపిక అన్నంలో పురుగుమందు కలుపుకుని తినేశారు. తమ ఇంట్లోనే ఆత్మహత్యకు ప్రయత్నించిన వారి పరిస్థితి గమనించిన ఇరుగుపొరుగు వారు నలుగురిని హుటాహుటిన కావలిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఆస్పత్రికి తరలించారు. నూతన సంవత్సరం వేళ ఒకే కుటుంబంలోని భార్య, భర్త, పిల్లలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం స్థానికంగా కలకలం రేపింది.

మురిపించన్



ఈ నెల నుంచి రూ.3 వేలకు పెంపు

- పక్కాగా అమలు చేస్తున్న ప్రభుత్వం
- అవ్వాతాతల మోములో చిరునవ్వు
- ఇప్పటికే దివ్యాంగులకు రూ.3 వేలు
- రేపటి నుంచి 8వ తేదీ వరకు పంపిణీ

అవ్వాతాతలు గౌరవంగా జీవనం సాగించేందుకు పింఛన్ సొమ్ము ఆసరాగా నిలుస్తోంది. ప్రతి నెలా ప్రభుత్వం అందించే పింఛన్ నగదు వారికి ఎంతగానో ఉపయోగపడుతోంది. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన సామాజిక పింఛన్లు రూ.3 వేలు అమలును రాష్ట్ర ప్రభుత్వం దిగ్విజయంగా అమలు చేస్తోంది. నూతన సంవత్సరం, సంక్రాంతి కానుకగా పింఛన్ పెంపు వారిలో ఆనందాన్ని నింపుతోంది.

ఉదయగిరి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన పింఛన్ల పెంపు హామీ దశల వారీగా అమలవుతోంది. 2019లో ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రూ.2 వేలు ఉన్న పింఛన్‌ను రూ.250 పెంచి రూ.2250 చేసి వైఎస్సార్ పింఛన్ కానుక ఫైల్‌పై తొలి సంతకం చేశారు. అప్పటి నుంచి ఏటా రూ.250 చొప్పున పెంచుతూ గత డిసెంబర్ నెల వరకు రూ.2,750 అందజేశారు. ఈ నెల నుంచి మరో రూ.250 వేలు పెంచి రూ.3 వేలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. తద్వారా ఎన్నికల వేళ ఇచ్చిన పింఛన్ల పెంపు హామీ పూర్తిస్థాయిలో అమలవుతోంది. ఇప్పటికే దివ్యాంగులకు రూ.3 వేలు, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రూ.10 వేలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి రూ.5 వేల చొప్పున పింఛన్ నగదు అందజేస్తూ ప్రభుత్వం మానవత్వాన్ని చాటుకుంటోంది. అంతేకాకుండా ప్రతి నెలా 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ నగదు అందజేస్తున్నారు. ఇది పక్కాగా అమలు చేస్తున్నారు. అంతేకాకుండా ఆస్పత్రిల్లో చికిత్స పొందుతున్న వారికి సైతం వలంటీర్లు ఆయా ప్రాంతాలకు వెళ్లి పింఛన్ నగదును అందజేస్తున్నారు.



లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేస్తున్న సచివాలయ ఉద్యోగి తిరుపాలు (ఫైల్)

గత ప్రభుత్వానికి భిన్నంగా..

గత టీడీపీ ప్రభుత్వంలో సార్వత్రిక ఎన్నికలకు నాలుగు నెలల ముందు వరకు పింఛన్‌దారులకు నెలకు రూ.1000 పింఛన్ నగదు పంపిణీ చేసేవారు. అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ప్రజాసంకల్పయాత్ర చేస్తున్న సమయంలో అవ్వాతాతల ఇబ్బందులను ప్రత్యక్షంగా చూసి వారికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సామాజిక పింఛన్లను రూ.3 వేల వరకు పెంచుతానని ప్రకటించారు. దీంతో కంగుతిన్న అప్పటి సీఎం చంద్రబాబునాయుడు హడావుడిగా 2019 సార్వత్రిక ఎన్నికలకు నాలుగు నెలల ముందు పింఛన్ నగదును రూ.2 వేలకు పెంచారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దశల వారీగా పింఛన్ నగదును పెంచుతూ ఈ జనవరి నుంచి రూ.3 వేలు చేసింది. అవ్వాతాతలకు ఈ పింఛన్ నగదు ఎంతగానో ఉపయోగపడుతోంది.

జిల్లాలో..

పింఛన్ లబ్ధిదారులు - **3,21,325** మంది

ఈ నెలలో కొత్తగా మంజూరైన పింఛన్లు - **10,500**

లబ్ధిదారులకు అందించనున్న నగదు - రూ.**96.20** కోట్లు



రామదేవులపాడులో ఇంటి వద్దనే వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ప్రభాకర్ (ఫైల్)

పండగలా పింఛన్ల పంపిణీ

సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక పింఛన్ల పంపిణీ పండగలా కొనసాగుతోంది. ప్రతి నెలా 1వ తేదీ ఉదయాన్నే వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ నగదు అందజేస్తున్నారు. పింఛన్ నగదు అందుకుంటున్న అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులతోపాటు వివిధ కేటగిరీలకు చెందిన పింఛన్‌దారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన రూ.3 వేల పింఛను నగదు పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 3 నుంచి 8వ తేదీ వరకు ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు పండగ వాతావరణంలో నిర్వహించనున్నారు. ఈ నెలలో కొత్తగా 10,500 మందికి పింఛన్లు మంజూరు కాగా, వారు కూడా పింఛన్ నగదు అందుకోనున్నారు.

పింఛన్ సొమ్మే ఆధారం



మాలాంటి పేదలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చే పింఛన్ సొమ్మే ఆధారం. ప్రతి నెలా ఈ నగదు మాకు ఎంతో ఉపయోగపడుతోంది. ఈ పింఛన్ లేకపోతే చాలా ఇబ్బందులు పడేవాళ్లం. ఈ నెల నుంచి రూ.3 వేలు ఇస్తామని చెప్పడం చాలా సంతోషంగా ఉంది.

– వి.అచ్చమ్మ, పింఛన్ లబ్ధిదారు, గణేశ్వరపురం, వరికుంటపాడు మండలం

కొత్త ఏడాది కానుకగా..



ప్రభుత్వం వైఎస్సార్ పింఛన్ కానుకను ఈ నెల నుంచి రూ.250 పెంచి కొత్త ఏడాది కానుకగా రూ.3 వేలు అందజేయనుంది. జిల్లాలో మొత్తం 3,21,325 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ.96.20 కోట్లు పంపిణీ చేస్తున్నారు. ఈ నెల 3న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కాకినాడలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.

– సాంబశివారెడ్డి, పీడీ, డీఆర్‌డీఏ

మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యం

- ప్రధాని నేతృత్వంలో తీర ప్రాంతాల అభివృద్ధి
- కేంద్ర మంత్రి పర్షోత్తమ్ రూపాల

బిట్రగుంట: దేశంలో మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టినట్లు కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమల శాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాల అన్నారు. సముద్ర తీరప్రాంతంలో ఫిషింగ్ హార్బర్‌ల స్థితిగతులు, మత్స్యకారుల జీవన పరిస్థితులు, మౌలిక సదుపాయాల కల్పన కోసం చేపట్టిన పదో విడత 'సాగర్ పరిక్రమ' పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి జువ్వలదిన్నెలోని ఫిషింగ్ హార్బర్‌ను సోమవారం పరిశీలించారు. చెన్నై నుంచి సముద్ర మార్గంలో సతీమణి సవితాబెన్ రూపాల, కేంద్ర మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ నీతూ కుమారి, ఇతర అధికారులతో కలిసి జువ్వలదిన్నె చేరుకున్న కేంద్ర మంత్రికి రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక మత్స్యకారులతో ముఖాముఖి ఏర్పాటు చేసిన సభలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ తీరప్రాంతాల అభివృద్ధి, మత్స్యకారుల ప్రయోజనాలే లక్ష్యంగా ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయడంతో పాటు రూ.20 వేల కోట్ల నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. మత్స్యకారుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ముందంజలో ఉందని అభినందించారు. దేశంలో ఉత్పత్తయ్యే మొత్తం మత్స్య సంపదలో ఆంధ్రప్రదేశ్ నుంచే 30 శాతం మేర ఉత్పత్తవుతున్నట్లు వివరించారు. అలాగే దేశంలోనే మత్స్య సంపద ఉత్పత్తిలో జిల్లా అగ్రస్థానంలో నిలుస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నట్లు తెలిపారు. మత్స్యకారుల స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి మరింత సహకారం అందించే దిశగా సాగర్ పరిక్రమ చేపట్టినట్లు తెలిపారు. అనంతరం స్థానిక మత్స్యకారులతో కలిసి కేక్ కట్ చేసి మంత్రి రూపాల దంపతులు నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు.



జువ్వలదిన్నెలో కేంద్ర మంత్రికి స్వాగతం పలుకుతున్న ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

ఇరు రాష్ట్రాలతో చర్చించి పరిష్కారం

ముఖాముఖి సందర్భంగా స్థానిక మత్స్యకారులు కడలూరు మత్స్యకారులు చేస్తున్న ఆగడాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మోటారు బోట్లతో వస్తున్న కడలూరు మత్స్యకారులు స్థానిక తీరంలో మత్స్యసంపదను కొల్లగొడుతున్నారని, ప్రశ్నిస్తే దాడులకు దిగుతున్నారని ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన ఇరు రాష్ట్రాల మత్స్యశాఖ అధికారులు, మత్స్యకారులతో మాట్లాడి శాంతియుతంగా సమస్యను పరిష్కరించనున్నట్లు హామీ ఇచ్చారు. అనంతరం 26 మంది మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డ్‌ల ద్వారా రూ.5.20 లక్షల రుణాన్ని చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. అలాగే రాయితీపై ఐస్‌బాక్స్‌లతో ఉన్న ద్విచక్ర వాహనాలను, ఒక పడవను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు, ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యరంగానికి రూ.20 వేల కోట్లు

ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన కింద రూ.20 వేల కోట్లతో దేశంలో మత్స్యరంగ అభివృద్ధికి కేంద్రం కృషి చేస్తోంది. తీరంలోని మత్స్యకారులతోపాటు ఆక్వా రైతులకు కూడా మేలు కలిగేలా సీఏ చట్టంలో సవరణ చేసి ఆక్వారంగాన్ని ఆదుకున్న ఘనత కూడా ప్రధాని మోదీకే దక్కుతుంది. మత్స్యరంగ అభివృద్ధికి కేంద్రం అమలు చేస్తున్న పథకాలను అందిపుచ్చుకుని రాష్ట్రంలోని మత్స్యకారులకు అత్యధిక ప్రయోజనాలు చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది.

– బీద మస్తాన్‌రావు, రాజ్యసభ సభ్యుడు

కెనాల్‌లో పూడికతీత చేపట్టాలి

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణం సందర్భంగా పూడికతో నిండిన బకింగ్ హామ్ కెనాల్‌లో పూడికతీత పనులు చేపట్టేలా కృషి చేయండి. బకింగ్ హామ్ కెనాల్‌లో పూడికతీత పూర్తయితే స్థానిక మత్స్యకారుల పడవలు కెనాల్ ద్వారా నేరుగా హార్బర్‌కు చేరుకోవచ్చు. అలాగే జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో ఒకవైపు 1,200 బోట్లు ఆగే పరిస్థితి ఉంది. రెండోవైపు కూడా బోట్లు ఆగేందుకు నిర్మాణాలు చేపట్టాలి. హార్బర్ నిర్మాణం ద్వారా 47 మత్స్యకార గ్రామాల్లో సుమారు 20 వేల మంది మత్స్యకారులకు లబ్ధి చేకూరుతుంది.

– ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే, కావలి

అర్జీలను గడువు లోపు పరిష్కరించండి

- జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్

నెల్లూరు(దర్గామిట్ట): జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో ప్రజలు అందజేసిన అర్జీలను పరిశీలించి నిర్దేశించిన గడువు లోపు సమస్యలను పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం జేసీ కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో డీఆర్వో లవన్న, జెడ్పీ సీఈఓ చిరంజీవిలతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీలను సంబంధిత అధికారులకు అందజేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు స్పందన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో డీపీఓ సుస్మిత, హౌసింగ్, మెప్మా పీడీలు నాగరాజు, రవీంద్ర, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, డీఈఓ గంగాభవాని, డీటీడబ్ల్యూఓ పరిమళ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యంపై విజి'లెన్స్'

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆ శాఖ అధికారులు పలుమార్లు హెచ్చరికలు చేస్తున్నా అక్రమార్కులు మాత్రం పట్టించుకోవడం లేదు. యథేచ్ఛగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారు. దీనిపై దృష్టి సారించిన ఆ శాఖ విజిలెన్స్ విభాగం అక్రమార్కుల ఆట కట్టిస్తోంది. కేసులు నమోదు చేస్తూ జరిమానాల రూపంలో కోట్లాది రూపాయలు వసూలు చేస్తోంది.

దూకుడు పెంచిన ఆ శాఖ విజిలెన్స్ విభాగం

- ఒక్క ఏడాదిలో 2,901 కేసులు నమోదు
- రూ.2,64,65,581 అపరాధ రుసుము వసూలు



విద్యుత్ చౌర్యంపై దాడులు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు (ఫైల్)

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ చౌర్యం నేరమని తెలిసినా అక్రమార్కులు అడ్డూ అదుపూ లేకుండా అక్రమ మార్గంలో విద్యుత్‌ను వినియోగిస్తూ ఆ సంస్థకు నష్టం చేకూరుస్తున్నారు. ఒక విద్యుత్ సర్వీసు నుంచి వైర్ల ద్వారా అక్రమంగా మరికొన్ని విద్యుత్ ఉపకరణాలకు వాడడం, బైపాస్ పద్ధతిలో నేరుగా విద్యుత్ లైన్ల నుంచి వినియోగిస్తూ చౌర్యానికి పాల్పడుతున్నారు. జిల్లాలో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారిలో ఆక్వా విద్యుత్ సర్వీసు వినియోగదారులు మొదటి స్థానంలో ఉండగా, వాణిజ్య, గృహ, పరిశ్రమల విద్యుత్ వినియోగదారులు తరువాతి స్థానాల్లో ఉన్నారు. వీరిపై విద్యుత్ విజిలెన్స్ అధికారులు దాడులు చేస్తూ అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. అపరాధ రుసుము కింద పెద్ద మొత్తంలో జరిమానా విధిస్తూ వారి భరతం పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో విద్యుత్ విజిలెన్స్ అధికారులు అక్రమార్కులపై కేసులు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేస్తున్నారు.

కేసులు ఇలా..

2022వ సంవత్సరంలో జిల్లాలో విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారిపై విజిలెన్స్ అధికారులు 2,817 కేసులు నమోదు చేసి రూ.2,09,04,725 అపరాధ రుసుము విధించారు. నాలుగు సార్లు నిర్వహించిన లోక్ అదాలత్‌లో 2,009 కేసులను రాజీ చేసి రూ.25,99,500 జరిమానా రూపంలో వసూలు చేశారు. అలాగే 2023వ సంవత్సరం జనవరి నుంచి డిసెంబర్ 28వ తేదీ వరకు 2,901 విద్యుత్ చౌర్యం కేసులు నమోదు చేసి అత్యధికంగా రూ.2,64,65,581 అపరాధ రుసుము విధించారు. ఈ ఏడాది 4 సార్లు నిర్వహించిన లోక్ అదాలత్‌లో 3,276 కేసులు రాజీ చేసి రూ.47,24,500లను జరిమానా రూపంలో వసూలు చేశారు. అలాగే ఆక్వాకు సంబంధించి 60 విద్యుత్ చౌర్యం కేసులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. కాగా విద్యుత్ విజిలెన్స్ అధికారులు స్థానిక విద్యుత్ శాఖ సిబ్బందికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నిరంతరం దాడులు చేస్తుండడంతో విద్యుత్ చౌర్యానికి సంబంధించిన కేసులు వెలుగులోకి వస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో

మొత్తం విద్యుత్ సర్వీసులు -	12,70,0081
గృహ వినియోగ సర్వీసులు -	8,99,151
వ్యాపార సర్వీసులు (వాణిజ్యం) -	97,411
పరిశ్రమల సర్వీసులు (ఎల్‌టీ) -	4,240
పరిశ్రమల సర్వీసులు (హెచ్‌టీ) -	814
ప్రార్థనా మందిరాల సర్వీసులు -	25,353
వ్యవసాయ సర్వీసులు -	2,16,732
ఆక్వా సర్వీసులు -	26,380

అక్రమంగా వినియోగిస్తే ఉపేక్షించం



విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. వారిపై కేసులు నమోదు చేసి పెద్ద మొత్తంలో జరిమానా విధిస్తాం. కొన్ని సందర్భాల్లో విద్యుత్ సర్వీసులను రద్దు చేసి కేసులు నమోదు చేస్తాం. కోర్టులో చార్జిషీట్ కూడా వేస్తాం. విద్యుత్ చౌర్యానికి పాల్పడే వ్యక్తుల గురించి సమాచారం అందిస్తే తక్షణమే చర్యలు తీసుకుంటాం. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతాం.

– శ్రీనివాసరెడ్డి, విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్, ఎస్పీడీసీఎల్

ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి



విద్యుత్ చౌర్యాన్ని అరికట్టడాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలి. విద్యుత్ చౌర్యం వల్ల న్యాయంగా విద్యుత్‌ను వినియోగించుకునే వారు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. దీని వల్ల ఏర్పడే నష్టంతో విద్యుత్ సంస్థ మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. అక్రమంగా విద్యుత్‌ను వాడుతున్నట్లు గుర్తిస్తే కేసులు నమోదు చేసి అపరాధ రుసుము వసూలు చేస్తాం. విద్యుత్ సర్వీసులను కూడా రద్దు చేస్తాం.

– వి.విజయన్, ఎస్ఈ, ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్

క్లుప్తంగా

వైఎస్సార్‌టీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ప్రదర్శిస్తున్న డీఈఓ, నేతలు

నెల్లూరు(టౌన్): 2024 సంవత్సర వైఎస్సార్ టీఎఫ్ స్టిక్కర్ క్యాలెండర్‌ను సోమవారం డీఈఓ గంగా భవాని ఆవిష్కరించారు. నెల్లూరులోని విద్యాశాఖ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నారాయణరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మునీర్‌జాన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసు, రాష్ట్ర కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షుడు రఘురామరెడ్డి, ట్రెజరర్ యానాదిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పోత్తయ్య, వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోర్టులో డిజిటల్ లైబ్రరీ ప్రారంభం



లైబ్రరీని ప్రారంభించిన సీఈఓ జీజే రావు

ముత్తుకూరు: మండలంలోని అదానీ కృష్ణపట్నం పోర్టు అడ్మిన్ బిల్డింగ్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీని సోమవారం సీఈఓ జీజే రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార సేకరణకు, విజ్ఞానం పెంచుకునేందుకు ఈ డిజిటల్ లైబ్రరీ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇంకా సౌత్ పోర్టు వద్ద ఆయన నూతన బ్రిడ్జి, వెస్ట్ గేట్ వద్ద డిజిటల్ పేమెంట్, యూపీఐ యంత్రాలను ప్రారంభించారు. వెస్ట్ గేట్ వద్ద వాహనాల డ్రైవర్లకు నిరంతరం రోడ్డు భద్రత, భద్రతా ప్రమాణాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో అడ్మిన్ హెడ్ గణేష్ శర్మ, సీఓఓ సంజయ్, కార్పొరేట్ అఫైర్స్ హెడ్ వేణుగోపాల్, ఫైనాన్స్ హెడ్ శ్రీకాంత్, మృత్యుంజయ్‌రామ్ పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో 'వెలుగు'

జగనన్న ఆరోగ్య సురక్షలో కంటి వైద్య పరీక్షలు

- విజయవంతంగా సాగుతున్న కార్యక్రమం
- ఉచితంగా ఆపరేషన్లు, అద్దాల పంపిణీ
- నేటి నుంచి రెండో విడత పరీక్షలు



కంటి అద్దాలు అందుకున్న వృద్ధులతో వైద్య సిబ్బంది (ఫైల్)

నెల్లూరు సిటీ: రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించింది. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పేద, మధ్య తరగతి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సమస్యలను బట్టి ఆయా విభాగాల వైద్యులకు రెఫర్ చేశారు. ఇందులో భాగంగానే డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని కూడా చేపట్టారు.

ఎంతమందికంటే..

జిల్లాలోని 623 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో కంటి వెలుగు కార్యక్రమాలు నిర్వహించారు. సుమారు 45 రోజులపాటు ఇవి జరిగాయి. 41 మంది వైద్యులు పరీక్షలు చేపట్టారు. మొత్తం 61,916 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో 6,260 మందికి ఆపరేషన్లు అవసరమని నిర్ణయించారు. ప్రస్తుతానికి 783 మందికి ఆపరేషన్లు జరిగాయి. అదే విధంగా 42,493 మందికి గానూ 15,921 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈనెల 15వ తేదీ నాటికి పూర్తి స్థాయిలో ఆపరేషన్లు, కంటి అద్దాలు పంపిణీని పూర్తి చేయాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు.

నేటి నుంచి..

జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. జూన్ నెల వరకు కార్యక్రమం కొనసాగుతుంది. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఆరోగ్య శిబిరాల్లో పూర్తిస్థాయిలో అన్ని వైద్య పరీక్షలు నిర్వహించి ప్రజల సమస్యలు పరిష్కరించనున్నారు. అవసరమైన వారికి ఆపరేషన్లు చేయించి సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ తగిన ఏర్పాట్లు చేసింది.

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం పేద కుటుంబాల ఆరోగ్యానికి భరోసా కల్పించింది. ముఖ్యంగా వృద్ధుల్లో కంటి వెలుగులను నింపుతోంది. ఆపరేషన్ చేయించుకునేందుకు ఆర్థిక పరిస్థితులు లేని వారికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతోంది. ఇప్పటికే వేలాది మంది కంటి అద్దాలను అందుకున్నారు.

జిల్లాలో..

కంటి వైద్య పరీక్షలు చేయించుకున్న వారు :	60,916
అద్దాలు అందుకున్న వారు :	15,921
ఆపరేషన్లు చేయించుకున్నది :	783



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ (ఫైల్)

ఆపరేషన్లు జరుగుతున్నాయి



కంటి ఆపరేషన్లు అవసరమైన ప్రతి ఒక్కరికీ చేయిస్తున్నాం. ఇప్పటికే కలెక్టర్ ఆదేశాల మేరకు త్వరితగతిన ఆపరేషన్లు చేయించాం. అద్దాల పంపిణీ కార్యక్రమం కూడా జరుగుతోంది. మంగళవారం నుంచి జరిగే రెండో విడత కార్యక్రమం కోసం అన్ని ఏర్పాట్లు చేశాం.

– ఎం.శర్వాణి, అంధత్వ నివారణ సంస్థ జిల్లా ప్రోగ్రాం మేనేజర్

క్రీడాకారుడికి అభినందనలు



నరేంద్రను అభినందిస్తున్న ద్వారకానాథ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): బీచ్ గ్రాప్లింగ్‌లో బంగారు పతకాన్ని సాధించిన ఎస్.నరేంద్రను నుడా చైర్మన్, ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ అభినందించారు. సోమవారం నుడా కార్యాలయంలో క్రీడాకారుడు, కోచ్ ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోచ్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ గత నెల 28 నుంచి 31వ తేదీ వరకు విశాఖపట్నంలోని ఆర్కే బీచ్ దగ్గర జరిగిన నేషనల్ బీచ్ గ్రాప్లింగ్ పోటీల్లో (54 కేజీల రెజ్లింగ్) నెల్లూరు జిల్లాకు చెందిన నరేంద్ర గోల్డ్‌మెడల్ సాధించినట్లు తెలియజేశారు. ద్వారకానాథ్ మాట్లాడుతూ మొత్తం 600 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనగా కోవూరు మండలం వేగూరు గ్రామానికి చెందిన నరేంద్ర గోల్డ్ మెడల్ సాధించడం సంతోషకరమన్నారు. అతను అంతర్జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలియజేశారు.



నెల్లూరు: రాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో భక్తులు

కిటకిటలాడిన ఆలయాలు

నూతన సంవత్సరం సందర్భంగా నెల్లూరు నగరంలోని వివిధ ఆలయాలకు సోమవారం భక్తులు పోటెత్తారు. వేకువ జాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లు ప్రత్యేకాలంకరణల్లో దర్శనమిచ్చారు.

– నెల్లూరు(బృందావనం)



నెల్లూరు: టౌన్‌హాల్ వద్ద ఉన్న వినాయకుడి ఆలయంలో పూజలు

ఏపీజీబీ ఖాతాదారులకు మెరుగైన సేవలు

- చైర్మన్ రాకేష్ కశ్యప్



మాట్లాడుతున్న చైర్మన్ రాకేష్ కశ్యప్

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఖాతాదారులకు కొత్త సంవత్సరంలో మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని చైర్మన్ రాకేష్ కశ్యప్ తెలిపారు. సోమవారం కడప నగరంలోని మరియాపురంలో ఉన్న బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతపురం, సత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, నెల్లూరు, బాపట్ల, తిరుపతి, ప్రకాశం జిల్లాల్లో మొత్తం 551 శాఖలు, 1,182 బిజినెస్ కరస్పాండెంట్లు, 9 ప్రాంతీయ కార్యాలయాలు బ్యాంక్‌కు ఉన్నట్లు తెలిపారు. 2023 డిసెంబర్ నాటికి రూ.44,808 కోట్ల వ్యాపారం కలిగి ఉందన్నారు. కార్డులు, మిస్డ్ కాల్ బ్యాంకింగ్, యూపీఐ, ఏఈపీఎస్, ఎన్ఏసీహెచ్, ఈసీఎస్ ఆదేశాలు, మైక్రో ఏటీఎంలు, ఏటీఎం తదితర వాటి ద్వారా ఖాతాదారులకు సేవలు అందిస్తున్నామన్నారు. ప్రత్యేక డిపాజిట్ ప్రాడెక్ట్ 'ప్రగతి కుబేర్–444'ను సాధారణ ప్రజలకు అత్యధిక వడ్డీ రేటు 7.50 శాతం, మహిళలకు అదనపు వడ్డీ రేటు 0.05 శాతం ఇస్తున్నామన్నారు. సీనియర్ సిటిజన్లకు 0.50 – 0.60 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు 0.75 శాతం అదనపు వడ్డీ రేటు ఇవ్వనున్నామన్నారు. అలాగే మహిళా సూపర్ సీనియర్ సిటిజన్లకు కూడా అత్యధికంగా 8.30 శాతం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జీఎంలు జగదీశ్వర్‌రావు, పీఆర్ పడ్డేట్వార్, సంజీవప్ప, రంగప్ప బేగర్, పి.రాజేంద్రన్, ఆర్.గిరితోపాటు చీఫ్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అడ్రస్ అడుగుతున్నట్లు నటించి..

- వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు దోపిడీ

మనుబోలు: పట్టపగలు ఓ దుండగుడు వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు తెంపుకెళ్లిన ఘటన మనుబోలు కోదండరామపురంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కోదండరామపురం రామాలయం సమీపంలో నివాసముంటున్న దండు శకుంతలమ్మ ఇంటి వద్దకు సోమవారం మధ్యాహ్నం ఓ వ్యక్తి స్కూటీపై వచ్చాడు. వాకిట్లో ఆమె ఒక్కటే ఉండడాన్ని గమనించాడు. ఏదో అడ్రస్ అడుగుతున్నట్లుగా నటిస్తూ హఠాత్తుగా మెడలోని బంగారు గొలుసును తెంపుకొని పరారయ్యాడు. ఈ పరిణామంతో షాక్‌కు గురైన శకుతలమ్మ తేరుకుని కేకలు వేయడంతో స్థానికులు వచ్చారు. గొలుసు 14 గ్రాములు ఉంటుందని బాధితురాలు తెలిపారు. నిందితుడు మూడు, నాలుగుసార్లు అటూ ఇటూ తిరిగాడని వెల్లడించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటన జరిగిన వీధిలో ఉన్న సీసీ కెమెరాల పుటేజీని పరిశీలిస్తున్నారు.

చందన, సీఎంఆర్‌లో వీక్లీ డ్రా

నెల్లూరు(బృందావనం): చందన, సీఎంఆర్లో క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి పండగ సంబరాల టాటా కారు విజేత పూర్ణ (ఇనమడుగు)కు మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వాహనాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా 3వ వీక్లీ డ్రా తీసి టీవీఎస్ మోటార్‌బైక్ విజేతగా వింజమూరుకు చెందిన మంజు (కూపన్ నంబర్ 52463)ను ప్రకటించారు. గత వారం డైలీ డ్రా విజేతలు 35 మందికి గ్రైండర్లు, మిక్సీలు, కుక్కర్లు తదితరాలను అందజేశారు. సీఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా ఎంత కొనుగోలు చేస్తే అంత విలువైన కూపన్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. వాటితో తదుపరి కొనుగోలు చేసుకోవచ్చన్నారు. సీఎంఆర్,చందనలో 1+2,3+2, 1+1 ఆఫర్లు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రాజీ యాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య, బొమ్మి సురేంద్ర, శైలేష్, మేనేజర్ వాసు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీని మొదటి స్థానంలో నిలుపుతాం : సీఈఓ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌ను జిల్లాలో మొదటి స్థానంలో నిలిచేలా కృషి చేస్తానని డీసీసీబీ నూతన సీఈఓ శ్రీనివాసరావు తెలిపారు. నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ వద్దనున్న డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆయన సీఈఓగా బాధ్యతలు స్వీకరించారు. రైతులకు మరిన్ని మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. అనంతరం ఆయనను బ్యాంక్ అధికారులు, సిబ్బంది, పలు యూనియన్ల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్సాహంగా ఇంటర్ వర్సిటీ క్రికెట్ పోటీలు

- విజేతగా ఏఎస్ఆర్ కళాశాల



ట్రోఫీ అందుకుంటున్న విజేత జట్టు

ఆత్మకూరు: పట్టణంలోని ఎస్ఆర్‌జే డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న ఇంటర్ వర్సిటీ కళాశాలల క్రికెట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఉత్సాహంగా సాగిన ఈ క్రికెట్ పోటీల్లో ఏఎస్ఆర్, ఎస్ఆర్‌జే డిగ్రీ కళాశాలల జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఏఎస్ఆర్ కళాశాల జట్టు 3 వికెట్ల తేడాతో విజేతగా నిలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్ఆర్‌జే కళాశాల జట్టు 12 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 116 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఏఎస్ఆర్ డిగ్రీ కళాశాల జట్టు 5 బంతులు మిగిలి ఉండగానే 3 వికెట్ల తేడాతో విజేతగా నిలిచింది. ఆ జట్టుకు కళాశాల ప్రిన్సిపల్ వరకుమారి, పీడీ సిరిమామిళ్ల వెంకటేశ్వర్లు ట్రోఫీ, ప్రశంసాపత్రాలు అందజేశారు. విజేత జట్టును కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, డైరెక్టర్ ప్రసాద్ అభినందించారు.

వేర్వేరు చోట్ల రైలు కింద పడి ముగ్గురి ఆత్మహత్య



వ్యక్తి మృతదేహం

నెల్లూరు(క్రైమ్): ఏ కష్టమొచ్చిందో స్పష్టమైన కారణం తెలియదు గానీ వేర్వేరు ప్రాంతాల్లో సోమవారం ముగ్గురు వ్యక్తులు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. రైల్వే పోలీసుల కథనం మేరకు..

విజయమహల్ గేటు సమీపంలో చెన్నై వైపు వెళ్లే పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి వయసు 55 నుంచి 60 ఏళ్లలోపు ఉండొచ్చని భావిస్తున్నారు. బ్లూ కలర్‌పై వైట్ కలర్ నిలువుగీతలు కలిగిన హాఫ్ హ్యాండ్స్ చొక్కా, బ్లూ, గ్రీన్, వైట్ కలర్ గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై ఎస్.హరిచందన ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

పెన్నా బ్రిడ్జి సమీపంలో..

ఓ వృద్ధుడు రైలు కింద పడి తనువు చాలించిన ఘటన పెన్నా బ్రిడ్జి సమీపంలో జరిగింది. ముంగమూరువీధికి చెందిన కైలాష్ కుమార్ (63)కు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. ప్రస్తుతం వారు ఆయనకు దూరంగా ఉంటున్నారు. కొంతకాలంగా కైలాష్ కుమార్ బోడిగాడితోట సమీపంలో ఒంటరిగా ఉంటున్నట్లు చెబుతున్నారు. ఏం జరిగిందో గానీ ఆయన సోమవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలంలో సగం తాగిన మద్యం బాటిల్ ఉంది. సమాచారం అందుకున్న ఎస్సై హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద లభ్యమైన ఆధార్, ఫోన్ నంబర్ల ఆధారంగా బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరావాల్సి ఉంది.

కరేడు రైల్వే గేటు సమీపంలో..

ఉలవపాడు: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని కరేడు రైల్వే గేటు సమీపంలో సోమవారం జరిగింది. ఎగువకు వెళ్లే లైన్‌లో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వయసు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుందని వారు తెలిపారు. బ్లూ కలర్ చొక్కా, లుంగీ ధరించి ఉన్నాడు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.25
సన్నవి	: రూ.18
పండ్లు	: రూ.6



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 122	బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 240
లేయర్ (లైవ్) : 90	
బ్రాయిలర్ చికెన్ : 220	లేయర్ చికెన్ : 153

